## రైతుల గోడును పట్టించుకోని నేషనల్ హైవే అధికారులు



- ఎత్తు తగ్గించి అండర్ పాస్ రోడ్డు నిర్మాణం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు
- ఎత్తు పెంచి అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని సిపిఐ వినతి

2 లో

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 06 | జూన్ | 2025
పేజీలు 8

# రైతన్న చూపు..పత్తిసాగు వైపు..!



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పత్తి సాగువైపు రైతన్నలు చూస్తు న్నారు. గతం కంటే కనీసం మద్దతు ధరను ప్రభుత్వం పెంచడంతో రైతుల్లో పత్తి సాగు చేయాలనే ఆశలు చిగురిస్తున్నాయి. రానున్న ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ అనుకూల వాతావరణం ఉందనే వార్తలు రావ డంతో రైతులు పత్తిసాగుకు ఉపక్రమిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే భూముల్లో వేసవి

మిగతా 2లో..

- కనీస మద్దతు ధర పెరగడంతో ఆశ
- జిల్లా వ్యాప్తంగా సుమారు 5 లక్షల ఎకరాల్లో సాగు
- విత్తనాలపై నిఘా పెంచిన ప్రభుత్వం
- నకిలీల అట కట్టించేందుకు రంగంలోకి టాస్క్ ఫోర్స్

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

-న్యాయమూర్తులు బిందుప్రియ, నాగలక్ష్మి

-మొక్కలు నాటి సంరక్షించాలి : డిఎఫ్‌వో సిద్దార్థ్ విక్రమ్ సింగ్



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అదనపు జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ ఏపూరి బిందుప్రియ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి, జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ (మొబైల్) బక్కెర నాగలక్ష్మి లు తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల అర్బన్ పార్కులో పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయమూర్తులు ఏపూరి బిందుప్రియ, బక్కెర నాగలక్ష్మి , డిఎఫ్‌వో సిద్దార్థ్ విక్రమ్‌సింగ్

మిగతా 2లో..

## వైరా రిజర్వాయర్ ఆనకట్టపై పర్యవేక్షణ ఎక్కడ..?



ప్రజాపక్షం/వైరాః ఖమ్మం జిల్లా పర్యాటక కేంద్రాల్లో గుర్తొచ్చేది వైరా రిర్వాయర్, అలాంటి వైరా రిజర్వాయర్ పర్యాటక కేంద్రం కనుమరుగైపోతుందని చెప్పవచ్చు. గతంలో వైరా అంటే పర్యాటకులను ఎంతో ఆకట్టుకునే రిజర్వాయర్ ప్రాంతం ఇప్పుడు అస్తవ్యస్తంగా ఉంది. రిజార్వయర్ ప్రాంతం ఇప్పుడు అస్తవ్యస్తంగా ఉంది. రిజర్వాయర్

మిగతా 2లో..

-మాయమవుతున్న సైడ్ గ్రిల్స్

-కట్టపై కమ్ముకున్న పిచ్చి మొక్కలు

-సోలార్ వెలుగులను దొంగిలిస్తున్నారు

-కట్ట పైనే మద్యం తాగుతున్న ఆకతాయిలు

-సిసి కెమెరాలు ఏర్పాటు ఎంతో అవసరం

## మొక్కల పెంపకం ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మంజిల్లాలో వన మహో త్సవం క్రింద నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు మొక్కల పెంపకం ప్రణాళికాబద్ధంగా చేపట్టి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వన మహోత్సవ కార్యక్రమంపై సంబం ధిత అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలె క్టర్ డా॥ పి. శ్రీజ, డిఎఫ్‌వో సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా

-అడవుల్లో పండ్లు, కూరగాయల మొక్కలు పెంచాలి

-అవెన్యూ ప్లాంటేషన్‌కు ప్రణాళిక

-వన మహోత్సవం కార్యక్రమంపై కలెక్టర్ సమీక్ష

డుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని నేడు జిల్లాలో అనేక చోట్ల మొక్కలు నాటడం జరి గిందన్నారు. మంత్రి ఆదేశాల మేరకు అర్బన్ పార్కు, ఇతర

మిగతా 2లో..

# రైతన్న చూపు..పత్తిసాగు వైపు..!

(మొదటిపేజీ తరువాయి)

దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ వాతవరణానికి సంబంధించి అనువైన విత్తనాలను కూడా ఎంపిక చేసుకునే పనిలో రైతులు బిజీగా ఉన్నారు. వ్యవసాయ అధికారులు సైతం భూ సార పరీక్షలు చేసేందుకు సిద్ధపడుతున్నారు.

**పత్తికి పెరిగిన ధర...**

ప్రభుత్వం ఈ ఏడాది వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ప్రకటించింది. కొత్త మద్దతు ధర ప్రకారం పత్తి సాధారణ రకం క్వీటాకు రూ.7710 కాగా మేలు రకం క్వింటాకు రూ.8110 పెంచింది. గతంలో ఈ ధరలు, రూ.7121,రూ.7521గా ఉంది. పత్తితో పాటు జొన్నలు, రాగి, శనగపప్పు, ఎర్ర కందిపప్పు, ఆవాలు తదితరాలకు కూడా కేంద్రం కనీసం మద్దతు ధర ప్రకటించింది. పత్తికి మంచి ధరే ఉండటంతో రైతులు పెద్ద ఎత్తున సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

**సుమారు 5 లక్షల ఎకరాలు...**

ఈ ఖరీఫ్ సీజన్లో రుతుపవనాల రాక ఆశాజనకంగా ఉండటంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతాంగం కనీసం 5 లక్షల ఎకరాల్లో పత్తిసాగు చేసేదుకు సిద్ధపడుతున్నట్లు వ్యవసాయాధికారులు అంచనాలు వేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2 లక్షల 60వేల ఎకరాలు, ఖమ్మం జిలాల్లో సమారు 2 లక్షల 40 వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మొత్తంగా రెండు జిల్లాల్లకు కలిపి 10 లక్షల ప్యాకెట్ల విత్తనాలు అవసరమ్యే అవకాశం ఉండగా, ఇప్పటికే డీలర్ల వద్దకు స్టాకు చేరుకుంది. కాగా విత్తనాల కొరత ఎక్కడా రాకుండా వ్యవసాయాధికారులు చర్యలు చేపట్టారు. కాగా గత ఏడాది కంటే కొద్దిగా విత్తనాల ధర పెరిగింది.

**నఖిలీలపై నిఘా...**

పత్తి వ్యవసాయం సీజనల్లో పెద్ద ఎత్తున నఖిలీ విత్తనాలు రాజ్యమేలే అవకాశం ఉండటంతో జిల్లా వ్యాప్తంగా టాస్క్ ఫోర్సు టీంలు రంగంలోనికి దిగాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో దుకాణాలను సైతం తనిఖీ చేసి రికార్డులు పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామాల్లోకి నఖిలీ విత్తనాలు అంటగట్టేందుకు కేటుగాళ్లు వచ్చే అవకాశం ఉందని, వారి మాయ మాటలకు మోసపోకుండా రైతులు జాగ్రత్తగా ఉండాలని పెద్ద ఎత్తున వ్యవసాయాధికారులు ప్రచారం చేస్తున్నారు. గ్రామాల్లోకి విత్తనాలు అమ్ముతామంటూ వచ్చే వారి వివరాలు ఇవ్వాలని టాస్క్‌ఫోర్టు టీం ఇప్పటికే పలుమార్లు ప్రకటించింది. ఇదిలా ఉండగా కృత్రిమ కొరత సృష్టించి వ్యాపారులు రైతుల దగ్గర ఎక్కువ గుంజే అవకాశం ఉందని, దీనిపై కూడా తగిన నిఘా పెడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. రైతులు నాణ్యమైన విత్తనాల కొనుగోలు చేసి మేలైన పంటలు పండించాలని, వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు తీసుకోవాలి వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

# వైరా రిజర్వాయర్ ఆనకట్టపై పర్యవేక్షణ ఎక్కడ..?



(మొదటిపేజీ తరువాయి)

ఆనకట్ట అభివృద్ధి కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఐదు కోట్ల రూపాయలతో పనులు చేపట్టారు. ఆ పనుల్లో నాణ్యత ఎంతో ఏముందో దేవుదెరుగు కాని ప్రస్తుతం రిజర్వాయర్ ఆనకట్టపై మార్నింగ్ ఈవినింగ్ పెద్ద ఎత్తున వాకింగ్‌కు ప్రజలు వెళుతున్నారు. దాంతో పాటు పర్యాటకులు కూడా వస్తున్నారు. రిజర్వాయర్ ఆనకట్టపై ఏర్పాటు చేసిన సోలార్ లైట్లను ఆకతాయిలు పగులగొట్టడం లైట్లు వెలగకుండా చేయడం కూడా చేస్తున్నారు. మరి కొంతమంది సోలార్ లైట్లు ఏర్పాటు చేసిన ఐరన్ పోల్స్ సైతం ఎత్తుకొని వెళ్లిపోతున్నారు. సైడ్ గ్రిల్స్ సైతం తీసుకొని పోతున్నారు. పర్యాటక కట్టపై పర్యవేక్షణ లేకపోవడమే దీనికి కారణం, మరోపక్క ఆనకట్టపై నడవడానికి కట్టపై పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. ఉదయం సాయంత్రం సమయంలో వాకింగ్ చేసే వారు ఈ పిచ్చి మొక్కలను చూసి భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**రిజర్వాయర్ ఆనకట్టపై పర్యవేక్షణ ఎక్కడ..?**

వైరా రిజర్వాయర్ ఆనకట్టపై పర్యవేక్షణ లోపం స్పష్టం కనిపిస్తుంది. గత సంవత్సర కాలం నుంచి ఆనకట్టపై ఎలాంటి పనులు చేపట్టలేదని చెప్పవచ్చును. ఎందుకు అంటే ఆనకట్ట పై భాగం మొత్తం పిచ్చి మొక్కలతో దర్శనమిస్తుంది. వీటిని శుభ్రం చేయించాల్సిన బాధ్యత ఎవరిది ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత ఎవరిది? ఆహ్లాదకరమైన వాతావరణ కల్పించకపోవడానికి బాధ్యులు ఎవరు? ఒక్కసారి ఆలోచించండి దీనికి బాధ్యత ఎవరు తీసుకుంటారో తెలుసుకొని ఆ అధికారులు ఆనకట్టపై పర్యవేక్షణ చేపడితే మంచిందని ప్రజలు కోరుకుంటున్నారు.





**ఆనకట్టపై మందుబాబులు చిందులు...**

వైరా రిజర్వాయర్ ఆనకట్టపై రాత్రిపూట కొంతమంది మందుబాబులు కట్టపైన కూర్చొని మందు తాగుతూ ఉండటంతో కట్టపై వాకింగ్ చేసే వారికి ఇబ్బందికరంగా ఉంది. కొంతమంది వాకింగ్ వచ్చిన ప్రజలను సూచి చూసి కూడా సైడ్ గ్రిల్స్ వద్ద కూర్చొని మందు తాగుతూ చిందులేస్తున్నారు. దీంతో సాయంత్రం పూట వాకింగ్‌కు వచ్చే ప్రజలు ఇబ్బందులు సైతం ఎదుర్కొంటున్నారు.

**సిసి కెమెరాలు ఏర్పాటు ఎంతో అవసరం...**

పర్యాటక కేంద్రాల్లో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న వైరా పర్యాటక కేంద్రానికి పెద్ద ఎత్తున పర్యాటకులు కూడా వస్తూ ఉంటారు. సాయంత్రం పూట రిజర్వాయర్ కట్టపై పర్యాటకులతో వాకింగ్ చేసే వారితో కళకళలాడుతూ ఉంటుంది. ఇలాంటి సమయంలో సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తే కట్టపై రక్షణ ఉంటుంది. అదేవిధంగా మందుబాబులు చిందులు, దొంగతనాలకు పాల్పడే వారిని కూడా గుర్తించవచ్చు.

కట్టపై సైడ్ గ్రిల్స్ ఎత్తుకు పోతుంది ఎవరు?

ఐదు కోట్ల రూపాయల వ్యయంతో రిజర్వాయర్ ఆనకట్టకు చేపట్టిన మరమ్మత్తులో భభాగంగా ఏర్పాటు చేసిన సైడ్‌గ్రిల్స్ రాడ్లను సోలార్ లైట్లు పోల్స్‌ను ఎవరు ఎత్తుకెళుతున్నారు. తరచుగా రోజు రోజుకి సైడ్ గ్రిల్స్ మాయమైపోతున్నాయి. దీనిపై కూడా అధికారులు దృష్టి సారించకపోతే కట్టకు ఉన్న సైడ్ గ్రిల్స్ పూర్తిగా మాయం అయ్యే ప్రమాదం ఉంది.

# రైతుల భూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి




**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూభారతి రెవెన్యూ సభలో రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని, ధరణి పాస్ బుక్స్‌లో వచ్చిన రైతుల సర్వే నెంబర్లు తప్పులు తడకలను రెవెన్యూ సభలో సరిచేసి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్ డిమాండ్ చేశారు. బోడేపూడి భవనంలో వైరా పట్టణ కమిటీ సమావేశం మచ్చామ ణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుంకర సుధాకర్ మాట్లాడతూ జూన్3వ తేదీ నుంచి 18వ తేది వరకు వైరా మండలంలో జరుగుతున్న రెవెన్యూ సభల్లో రైతుల భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దాదాపు 80 సంత్సరా లనుంచి దళితులు, పేదల సాగు స్వాధీనంలో ఉన్న భూములకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని, వాళ్లకు రైతు భరోసా, రైతు భీమా వర్తింపజేయాలని, రెవెన్యూ రికార్డుల్లో గాని భూ స్వాధీనంలో గాని ఎటువంటి ఆధరాలు లేని నవాబులు, నాజురుద్దీన్ వారసులం మేము అని వచ్చి రెవెన్యూ సభలో దరఖాస్తులు చేసుకుంటున్నా వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, సీలింగు అసైన్మెంట్ బంజారా, నవాబు నజారుద్దీన్ పేర్లతో ఉన్న సాగు భూమి ప్రస్తుతం ఎవరు స్వాధీనంలో ఉంటే వాళ్లకు పట్లాదారు పాస్ పుస్తకాలు ఇచ్చి ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను రైతులకు ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు,పట్టణ నాయకులు బంతు సమత, గుడిమెట్ల రజిత, హరి వెంకటేశ్వరరావు, సంక్రాంతి నర్సయ్య, పైడిపల్లి సాంబశివరావు, రాచ బంటి బత్తిరన్న, కొంగర సుధాకర్, అనుమోలు రామారావు, గుడిమెట్ల మోహన్‌రావు, గుమ్మా నర్సింహారావు, తోట కృష్ణవేణి, కామినేని రవి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్కును సఫారీ వాహనంలో సందర్శించారు. నర్సరీ, నిర్మాణంలో ఉన్న బోటింగ్ ట్యాంక్, యోగా షెడ్డు ప్రాంతాలను పరిశీలించారు. పార్కులో పరిశుభ్రత, మొక్కల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో కలిసి వారు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని భవిష్యత్తు తరాల కోసం పచ్చదనాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనల మేరకు వెలుగుమట్ల అర్బన్ పార్కును ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దినట్లు నిర్వహకులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ఆదర్శంగా పార్కు నిలుస్తుందని ముఖ్య అతిథులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రజా అభియోజకులు జి. రాహుల్, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల గోడును పట్టించుకోని నేషనల్ హైవే అధికారులు




**ప్రజాపక్షం/బోనకల్ :** నాగపూర్ అమరావతి నేషనల్ హైవే నిర్మాణ పనుల్లో భాగంగా మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామం వద్ద అండర్ పాస్ నిర్మాణం ఎత్తు పెంచాలని రైతులు వేడుకుంటున్నా అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. 5మీటర్ల ఎత్తు వరకు అండర్ పాస్ నిర్మాణం చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఎన్‌హెచ్ అధికారులు 3.5 మీటర్ల ఎత్తు వరకు మాత్రమే నిర్మాణ పనులు చేపడుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నేషనల్ హైవే ప్రాజెక్టు అధికారులకు సిపిఐ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కొంగర కృష్ణయ్య మాట్లాడుతూ తక్కువ ఎత్తులో అండర్ పాస్ నిర్మాణం చేపడితే పక్కనే ఉన్న చిన్నబీరవల్లి గ్రామానికి , వ్యవసాయ పనులకు నిమిత్తం భూములకు ట్రాక్టర్స్, డోజర్స్, హార్వెస్టర్ వెళ్లేందుకు వీలు కాదని, దీంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. చీన్నబీరవల్లి గ్రామం నుండి వ్యవసాయ భూములు నేషనల్ హైవేకు అవతల వైపు ఉన్నందున అండర్ పాస్ నిర్మాణం ఎత్తు 5మీటర్లు పెంచటం వల్ల వ్యవసాయ పనులకు ఆటంకం లేకుండా ఉంటుందని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి అండర్ పాస్ ఎత్తును పెంచి నిర్మాణ పనులు చేపట్టి రైతులకు, చిన్నబీరవల్లి గ్రామ ప్రజలకు ప్రయాణం చేసేందుకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కొంగర వెంకటేశ్వరరావు, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకం ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

పల్లె ప్రకృతి వనాల్లో ప్లాస్టిక్ వాడకం పూర్తి స్థాయిలో తగ్గించాలన్నారు. ఖమ్మంజిల్లాలో ఈ ఏడాది ప్రభుత్వం వన మహోత్సవం క్రింద 35.32 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. ప్రతి శాఖ వారికి కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. గత పదేళ్లలో నాటిన మొక్కలు, వారి సర్వేయల్ రేట్ వివరాలతో కూడిన నివేదిక అందించాలన్నారు. జూన్ నెలలో ముందస్తుగా మొక్కలు నాటేందుకు సైట్లను జియో కోఆర్డినేట్స్‌తో కలిసి గుర్తించాలని తెలిపారు. ఉపాధి హామీ పథకంక్రింద నర్సరీలలో పెంచిన మొక్కలను వన మహోత్సవం క్రింద నాటాలన్నారు. మనం ఏ ప్రాంతలో ఎటువంటి మొక్కలు నాటితే సర్వేయల్ రేటు అధికంగా ఉంటుందో ప్రణాళికాబద్ధంగా చేయాలన్నారు. గత మూడేళ్లుగా ఎక్కడ ప్లాంటేషన్ చేశామో, అక్కడ చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటడం, మొక్కలకు ట్రీగార్డ్ ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. కోతుల బెడద కారణంగా అటవీ ప్రాంతాల్లో పండ్లు, కూరగాయల మొక్కలను పెద్ద ఎత్తున పెంచాలన్నారు. జాతీయ రహదారులు, సీతారామ ఎత్తిపోతల పథకం, ప్రాజెక్ట్ కెనాల్స్, ఇతర నీటిపారుదల ప్రాజెక్టు కెనాల్స్ స్థలంలో మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో అనుకూలంగా ఉన్న స్థలంలో మంకీ ఫుడ్ కోర్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల నివవారణకు క్లాత్ బ్యాగ్‌ను వినియోగించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం వన మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, క్లాత్ బ్యాగులను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టరేట్ ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ మొక్కలు నాటారు.ఈ సమావేశంలో జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా బిసి, గిరిజన సంక్షేమ శాఖాధికారులు జ్యోతి, విజయలక్ష్మి, జిల్లా ఇరిగేషన్ అధికారి వెంకట్రాం, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, ఈడి ఎస్‌సి కార్పోరేషన్ నవీన్‌బాబు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భూ భారతి చట్టానికి సంబంధించి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం ఆర్డివో జి. నర్సింహారావు తెలిపారు. గురువారం ఖమ్మం నగరంలోని ఒకటవ డివిజన్ కైకొండాయిగూడెంలో, రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను ఆర్డివో నర్సింహారావు సందర్శించారు. సదస్సుల వద్దకు వచ్చిన రైతులతో ఆర్డివో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డివో మాట్లాడుతూ ధరణి స్థానంలో ప్రభుత్వం నూతనంగా భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చిందన్నారు. ఆర్ఎస్ఆర్, సర్వే నెంబర్ల తప్పు, సాదాబైనామా, ఇతర భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. దరఖాస్తు ఇచ్చిన వెంటనే రశీదు కూడా అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు, రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత ఆధ్వర్యంలో మంచుకొండలో, డిప్యూటీ తహసీల్దార్ మురళీధర్ ఆధ్వర్యంలో రేగులచలకలో, ఖమ్మం ఒకటవ డివిజన్ కైకొండాయిగూడెంలో అర్బన్ తహసీల్దార్ సైదులు ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు ప్రవీణ్, సత్యనారాయణ, వహీద్, సిబ్బంది పాల్గొన్నారు.

# వీరబాబు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ప్రజాపక్షం/ రఘునాథపాలెం : అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న చిమ్మపుడి గ్రామానికి చెందిన పరిమిశెట్టి వీరబాబును ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. గురువారం చిమ్మపుడి గ్రామానికి వెళ్లి వీరబాబు కుటుంబాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరామర్శించారు. వీరబాబు చిత్ర పటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి ఎల్ల వేళల అండగాఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసి రైతులను బలితీసుకుంటుందన్నారు. రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా ఇస్తామని రైతులను మభ్యపెట్టి వారి చావుకు కారణమవుతుందన్నారు. అప్పుల బాధ తట్టుకోలేక ఇంకెంత మంది రైతుల ఆత్మహత్యలను ప్రభుత్వం చూడాలని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలను ఆదుకోవాలని, రైతుబీమా, రైతుభరోసా, రుణమాఫీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసిఆర్ హయాంలో వ్యవసాయాన్ని పండుగ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం దండగ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపిపి గుత్తా రవి, ఆత్మ మాజీ చైర్మన్ భూక్యా లక్ష్మణ్‌నాయక్, దొంతు సత్యనారాయణ, కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, గొర్రె శ్రీనివాసరావు, మోతారపు సుధాకర్, వెంకటరెడ్డి, విజయ్, జానీ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు వితరణ





ప్రజాపక్షం/ రఘునాథపాలెం : సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు వితరణ చేశారు. గురువారం మండల పరిధిలోని కోటపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి ఉపాధ్యక్షులు ఏనుగు శివరాఘవ మాత్య మూర్తి జయంతి సందర్భంగా గర్భిణీ స్త్రీలు, బాలింతల కోసం కుర్చీలు, చిన్నారుల కోసం బేబీ చైర్స్, వాటర్ క్యాన్ తదితర రూ. 12వేల విలువ గల వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాలతీదాస్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన వస్తువులను అందజేయడం ఆనందంగా ఉందన్నారు. బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు సుమన్‌బాబు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎస్‌కెఎం సుభాని, కొండా రామకృష్ణ, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసీ ఆఫీసర్ల సంబురాలు





ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఫార్మసిస్టులను ప్రభుత్వం ఫార్మసీ ఆఫీసర్లుగా హోదా కల్పించిన సందర్భంగా సంబురాలు నిర్వహించారు. గురువారం ఐడివోసి ప్రాంగణంలోని స్ఫూర్తి కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఫార్మసీ ఆఫీసర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫార్మసిస్టులను ఫార్మసీ ఆఫీసర్లుగా ప్రభుత్వం గుర్తించి గెజిట్ విడుదల చేసిన సందర్భంగా సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఎంఅండ్‌హెచ్‌వో కళావతి బాయి హాజరై మాట్లాడుతూ ముందుగా ఫార్మసీ ఆఫీసర్లకు అభినందనలు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు లాగే ప్రముఖ పాత్ర వహిస్తుంది ఫార్మసీ ఆఫీసర్లే అన్నారు. రోగులతో ప్రేమ పూర్వకంగా మాట్లాడుతూ వైద్యులు రాసిన మందులను ఇచ్చి వాటిని ఎలా వాడాలో వివరంగా చెప్పి రోగులను ఆరోగ్యవంతులుగా చేస్తున్నారన్నారు. గతంలో కాంపౌండర్ ఆ తర్వాత ఫార్మసిస్టు గ్రేడ్ 1, గ్రేడ్ 2 అని, జిల్లాలో ప్రధాన మందుల స్టోర్‌లో ఉండేవారిని డిస్ట్రిక్ ఫార్మసీ సూపర్ వైజర్ అని పిలిచే వారని ఆమె తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం వారిని ఫార్మసిస్టు గ్రేడ్ 1ను సీనియర్ ఫార్మసీ ఆఫీసర్‌గా, గ్రేడ్2 ను ఫార్మసీ ఆఫీసర్‌గా జిల్లా ఫార్మసీ సూపర్‌వైజర్‌ను జిల్లా ఫార్మసీ ఆఫీసర్‌గా మార్చడం అభినందనీయ మన్నారు. విధులను సక్రమంగా మరింత సమర్థవంతంగా నిర్వహించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఈ ఔషధి పోర్టల్‌లో మందుల వివరాలను ఏరోజు కారోజు నమోదు చేయాలని తెలిపారు. అనంతరం ఫార్మసీ అధికారులకు బ్యాడ్జీలను అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో సైదులు, ప్రోగ్రాం అధికారులు చందు నాయక్, వెంకటరమణ, రామారావు, జిల్లా ఫార్మసీ ఆఫీసర్ (ఇంచార్జ్) మోహన్, సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ఫార్మసీ ఆఫీసర్ మంగీలాల్, పద్మ, లింగమూర్తి, ఫార్మసీ అధికారులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి సంరక్షించాలి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, సహాయ కార్యదర్శి పగడాల మల్లేష్ లు తెలిపారు. గురువారం వన్‌టౌన్ ముత్యాలమ్మ గుడి ప్రాంతంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా జానిమియా, పగడాల మల్లేష్ లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు రావాలన్న, అతివృష్టి, అనావృష్టి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే మొక్కలు నాటాలని తెలిపారు. ప్రకృతి మనం రక్షించుకుంటే అది మనల్ని పరిరక్షిస్తుందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఐదు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యూ లక్ష్య స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు గరిడేపల్లి సత్యనారాయణ, దంతాల నాగరాజు, శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు జాబ్ మేళా

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని నిరుద్యోగ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు నేడు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల ఆరు శుక్రవారం ఉదయం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ టేకులపల్లి) ఖమ్మం నందు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎసాఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో బ్రాంచ్ మేనేజర్లు, కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ సర్వీస్ మేనేజర్ సంబంధిత ఖాళీల ఉద్యోగాలకు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఇంటర్, డిగ్రీ అర్హత గల పురుష అభ్యర్థులు అర్హులని ఆమె తెలిపారు. ఇట్టి ఉద్యోగ ఖాళీలు ఖమ్మం, సూర్యాపేట జిల్లాల నందు ఉన్నాయని ఎంపికైన వారికి వేతనం రూ. 15వేల నుండి రూ. 35వేల వరకు ఉంటుందని తెలిపారు. మొత్తం 54 ఉద్యోగ ఖాళీల భర్తీకి జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి గల వారు విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని ఆమె తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం

ఎమ్మెల్యే రాగమయి

ప్రజాపక్షం/సత్తుపల్లి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలంతా మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు సత్తుపల్లి శాసనసభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్. గురువారం పర్యావరణ పరిరక్షణ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పట్టణం లోని వేశ్య కాంతల చెరువు కట్టపై రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ తో కలిసి సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.రాగమయి మొక్కలు నాటారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని, పర్యావరణం బాగున్నప్పుడే మనము బాగుంటామన్నారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహ రావు, కమల్ పాషా, పింగుల సామ్యూల్, జీవన్, కాంతారావు, ప్రసాద్, చల్లగుళ్ల కృష్ణారావు, రాజీవ్ నగర్ కాలనీ కాంగ్రెస్ నాయకులు షరీఫ్, ఆంగోతు రామారావు, పార్థ సారథి, మున్సిపల్ కమీషనర్ నరసింహ, హౌసింగ్ ఆఫీసర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.



# 17లోగా దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : జూన్ 17లోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ నందు 3వ, 5వ, 8వ తరగతుల ప్రవేశాల కొరకు గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 26 సంవత్సరానికి ఖమ్మం జిల్లాకు చెందిన బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో అర్హులైన గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు ప్రవేశం అందిస్తామని తెలిపారు. మూడవ తరగతి విద్యార్థులకు 29, ఐదవ తరగతి విద్యార్థులకు 14, ఎనిమిదవ తరగతి విద్యార్థులకు 14సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. దరఖాస్తుల గడువు జూన్ 17తో ముగుస్తుందని తెలిపారు. ఆసక్తి గల దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జూన్ 20న ప్రాజెక్టు అధికారి అధ్యక్షతన ఐటిడిఏ భద్రాచలం ఆఫీస్ నందు తరగతుల వారీగా లాటరీ పద్ధతిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఒక కుటుంబం నుంచి ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణ ప్రాంతాల్లో రెండు లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు ఉండాలని తెలిపారు. దరఖాస్తుకు కుల, నివాస ధృవీకరణ పత్రం, గతేడాది చదివిన పాఠశాల స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను జత చేయాలని ఐటిడిఏ పివో తెలిపారు. జూన్ 17న సాయంత్రం ఐదు గంటల లోపు ఉప సంచాలకులు గిరిజన సంక్షేమ కార్యాలయం, జిల్లా కలెక్టరేట్ ఖమ్మం నందు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

# విపత్తు నివారణపై అవగాహన సదస్సు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : విపత్తు సమయంలో చేపట్టాల్సిన నివారణ చర్యలపై ఎస్‌బిఐటి కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్ఎఫ్) హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు జాతీయ విపత్తు నివారణ సంస్థ ఇన్‌స్పెక్టర్ గౌతమ్, జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ విపత్తు చెప్పి రాదని అది జరిగిన వెంటనే స్పందించేందుకు యువత ముందుండాలన్నారు. విపత్తు జరిగినప్పుడు నష్ట నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ ఎన్‌డిఆర్ఎఫ్ సేవలను కొనియాడారు. గతేడాది ఖమ్మంజిల్లా ఎదుర్కొన్న వరద ముంపులో జాతీయ బృందాలతో పాటు స్థానిక యువత అందించిన తోడ్పాటును గుర్తు చేసుకున్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో అందించాల్సిన సిపిఆర్, వైద్య విధానంపై విద్యార్థులకు శిక్షణ అందించినట్లు ఆమె తెలిపారు. అగ్నిప్రమాదం, వరదలు, భూకంపం వంటి విపత్కర పరిస్థితుల్లో అవలంభించాల్సిన కనీస ప్రమాణాలపై ఈ సదస్సులో అవగాహన కల్పించినట్లు ఆమె తెలిపారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా ఇటువంటి శిక్షణలు సామాన్య ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. తద్వారా నష్ట నివారణ తగ్గించవచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జే. రవీంద్రబాబు, ఎస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

ప్రజాపక్షం/ బోనకల్ : మండల కేంద్రం బోనకల్ రైతు వేదిక నందు శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సదస్సును నిర్వహించనున్నట్లు ఫోరం చైర్‌పర్సన్ ఎన్‌వి. వేణుగోపాలచారి తెలిపారు. ఈ సదస్సులో నూతన సర్వీసులు మంజూరు, అదనపు లోడు క్రమబద్ధీకరణ, సర్వీస్ పేరు మార్పు, హెచ్చు మొత్తంలోగత బిల్లులు, కేటగిరి మార్పు, సర్వీస్ రద్దు తదితర విద్యుత్ సంబంధించిన వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించటం జరుగుతుందని తెలిపారు. ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు సదస్సు జరుగుతుందని, వైరా సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/కామేపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ తెలిపారు. మండల పరిధిలోని రుక్కితండా గ్రామ పంచాయితీ కార్యాలయంలో భూభా రతి సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం తీసుకువచ్చిందని తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రఫీ ఉద్దీన్ మాట్లాడుతూ సర్వే నెంబర్ తప్పులు భూమి హద్దులు రికార్డులలో తప్పుల నమోదు వంటి సమస్యలను రైతులు చట్టంలో పరిష్కరించుకు నేందుకు వీలు కలుగుతుందని అన్నారు. రైతులు దగ్గర దరఖాస్తులు స్వీకరించి వారికి రసీదు అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ విజయ, పంచాయితీకార్యదర్శి ఎండి ఫజల్ శ్యామ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ రవికుమార్, రికార్డ్ అసిస్టెంట్ కన్నా మాల శ్రీను, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పోలంపల్లి వద్ద రోడ్డు ప్రమాదం

### -ఏడుగురికి తీవ్ర గాయాలు



ప్రజాపక్షం/కారేపల్లి: పోలంపల్లి గ్రామం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడుగురికి తీవ్రంగా గాయపడ్డారు. ఈవిషయంపై వివరాలు ఇలా ఉన్నాయి. పేరుపల్లి పరిధిలోని జామల్‌పల్లి వివాహ వేడుకలకు హాజరవుతున్న గుండాల మండలంలోని కాంచనలపల్లి గ్రామానికి చెందిన ఆరుగురు టాటా మ్యాజిక్ ద్వారా పోలంపల్లి గేట్ తండా గ్రామ శివారులో ఉన్న వాటర్ ట్యాంక్ మార్గాన ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో వాటర్ ట్యాంక్ వద్ద టాటా మ్యాజిక్ స్టీరింగ్ విరిగిపోవడంతో వాహనం అదుపు తప్పి పక్కకు వెళ్లింది. ఈప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న సుమారు డ్రైవర్‌తో కలిపి ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని తీవ్ర గాయాలైన వారిని ఆటో సహాయంతో హాస్పిటల్‌కు తరలించారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : పర్యావరణ పరిరక్షణ పరిరక్షణ మనందరి బాధ్యతని గ్రంధాలయ నూతన కార్యదర్శి కే కరుణ కుమారి అన్నారు. దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాగ్రంధాలయంలో ఆమె గురువారం మొక్కను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యదర్శిగా పదవీబాధ్యతలు చేపట్టిన మొదటిరోజే పర్యావరణ పరిక్షణలో భాగంగా మొక్కను నాటడం మంచి అనుభూతిని ఇచ్చిందన్నారు. అడవులు అంతరించి పోయి వాతావరణ సమతుల్యతలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ప్రతీ ఒక్కరూ విరివిగా మొక్కలు నాటడం ద్వారా రాబోయే తరాలవారికి మేలు జరుగుతుందన్నారు. బాధ్యతగా ప్రతీ ఒక్కరు తలా ఒక్క మొక్కను నాటి భావితరాల జీవనగమనానికి చేయూతనివ్వాలని కోరారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమెకు సిబ్బంది మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ ఇంచార్జ్ ఎం నవీన్ కుమార్, గ్రంధపాలకురాలు జి మణిమృధుల, విశ్రాంత ఉద్యోగి కోటేశ్వరరావు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు లంచ్ బాక్స్ వితరణ



ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని కిష్టారం గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు 500 పైన సాధించిన మొగిలి.సంతోష్ (544), ఏ. ఉమా ప్రసాద్ (531), పాలకుర్తి జెస్సికా (520), షణ్ముఖ. నాగవరుణ్ (517), పి.హారిక (514) ఎన్.అమృత(513), ఎస్.విష్ణు వర్ధన్ (512), ఎస్ కార్తీక్ (509) విద్యార్థిని ,విద్యార్థులకు గ్రామ పంచాయితీ కార్యదర్శి యం.వి రమణ సహాయంతో అందజేసిన లంచ్ బాక్స్ లను సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ విధి నిర్వహణలో గ్రామ శ్రేయస్సు, అభివృద్ధికి కృషి చేస్తూ విద్యార్థుల అభ్యున్నతికి సహకరిస్తూ గత నెలలో నిర్వహించిన సీ.ఎం కప్ మండల క్రీడాకారులకు తన వంతు ఆర్థిక సహాయంతో భోజన సదుపాయం ఏర్పాటు చేసి,వాలీబాల్ మహిళ విభాగంలో ప్రథమ స్థానం సాధించడానికి కృషి చేసిన కిష్టారం గ్రామపంచాయతీ కార్యదర్శి యం.వి రమణ ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో సుజల రాణి, గ్రామ పెద్దలు ఉడతనేని అప్పారావు, నరుకుళ్ళ అప్పారావు, నరుకుళ్ళ రవి, పానెం ఈశ్వర్, మారోజు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం నియోజకవర్గంలో మాజీ మంత్రి పువ్వాడ పర్యటన





ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నియోజక వర్గంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విస్తృతంగా పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురువారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం నగరంలోని రామచంద్రయ్య నగర్‌లో వల్లభ డెవలపర్స్ ఆధ్వర్యంలో నిర్మించనున్న నూతన భవన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. రఘునాథపాలెం మండలం జికెబంజర గ్రామంలో బిఆర్ఎస్ నాయకుడు భూక్యా బాలాజీ కుమార్తె స్వరూప రాజ్‌కుమార్ వివాహానికి హాజరై నూతన వధూవరులను పువ్వాడ అజయ్‌కుమార్ ఆశీర్వదించారు. కామేపల్లి మండలం తాళ్లగూడెం గ్రామానికి చెందిన డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం బావమరిది యరగడ్ల బాబు ఇటీవల మరణించగా వారి దశ దిన కర్మకు పువ్వాడ అజయ్‌కుమార్ హాజరై నివాళులర్పించారు. ఖమ్మం కార్పోరేషన్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మగ్బూల్ తల్లి రంజాన్‌బీ ఇటీవల మృతిచెందగా ఆమె మృతికి పువ్వాడ అజయ్‌కుమార్ నివాళులర్పించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఖమ్మం మామిళ్లగూడెం 49వ డివిజన్ మహిళా నాయకురాలు కొదమసింహం సాహితి తండ్రి వెంకటకృష్ణమాచార్యులు అనారోగ్యంతో మృతి చెందగా వారి భౌతికాయాన్ని సందర్శించి పువ్వాడ అజయ్‌కుమార్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. 17వ డివిజన్ బిఆర్ఎస్ నాయకుడు వడ్డెల్లి లెనిన్ చౌదరి ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకున్నారు. వారి స్వగృహంకు వెళ్లి లెనిన్‌ను పువ్వాడ అజయ్‌కుమార్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. 35వ డివిజన్ బిఆర్ఎస్ నాయకుడు కేశగాని రవి మాతృమూర్తి కమలమ్మ ఇటీవల మృతిచెందగా ఆమె చిత్ర పటానికి పువ్వాడ అజయ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆత్మ మాజీ ఛైర్మన్ భూక్యా లక్ష్మణ్ నాయక్, సొసైటీ ఛైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, నాగండ్ల కోటేశ్వరరావు, పిన్ని కోటేశ్వరరావు, మాటేటి నాగేశ్వరరావు, రుద్రగాని ఉపేందర్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి క్యాంపు కార్యాలయంలో ఘనంగా సంబురాలు




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి ఘన విజయం సాధించి ప్రజాసేవలో ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్‌శ్రేణులు, అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా సంబురాలు నిర్వహించారు. గురువారం ఖమ్మంలోని ఎంపి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి, మద్దినేని స్వర్ణకుమారి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. జిల్లా చరిత్రలో ఎవరికి దక్కనంత అఖండ మెజార్టీతో రఘురాంరెడ్డి గెలిపొందారని ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని వారు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి కొప్పుల చంద్రశేఖర్ తో పాటు 50 మంది రక్తదానం చేశారు. యూత్ కాంగ్రెస్ బాధ్యులు క్రాంతి, కిరణ్ ఆధ్వర్యంలో కాల్వొడ్డు నుంచి గట్టయ్య సెంటర్‌లోని ఎంపి క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు తుంబూరు దయాకర్‌రెడ్డి, కొప్పుల చంద్రశేఖర్ ఖాకీ చొక్కాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ కోటా రాంబాబు, లింగాల రవికుమార్, పలు నియోజక వర్గాల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 11న సిపిఐ మండల మహాసభని జయప్రదం చేయండి

### -సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి




ప్రజాపక్షం/ములకలపల్లి: సిపిఐ గ్రామ శాఖ మహాసభలు రేగులకుంట, నల్లముడి గ్రామాల్లో వాడే చిన్న నగేశ్, కూరం దారయ్య అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్ పాల్గొని, మాట్లాడుతూ సిపిఐ పార్టీ భారతదేశంలో ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిందని, ఇప్పటి వరకు దేశంలో ఏ పార్టీ 100 సంవత్సరాల చరిత్ర కలిగి లేదన్నారు. ప్రజలలో మమేకమై అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటలో 4500 మంది వీర కిశోరాలు అమరులై నైజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడి ఆనాడు తెలంగాణ సాధించుకున్న చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉన్నదని అన్నారు. మన ప్రాంతంలో సిపిఐ ఆధ్వర్యంలో అనేక భూపోరాటాలు ప్రజా ఉద్యమాలు నిర్మించి పేద ప్రజలకు భూములు పంపిపెట్టి వ్యవసాయ కూలీలు రైతాంగ పోరాటాలు నిర్వహించిన ఘన చరిత్ర ఎర్రజెండా పార్టీ సిపిఐదని కొనియాడారు. జూన్ 11న ములకలపల్లి రాయల్ పంక్షన్ హాల్‌లో సిపిఐ మండల మహాసభ జరుగనున్నదని ఈ మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా హాజరు కానున్నారని తెలిపారు. రేగులకుంట సిపిఐ శాఖ కార్యదర్శిగా కూరం నగేశ్, సహాయ కార్యదర్శిగా కురం సత్యం, నల్లముడి శాఖ కార్యదర్శిగా పడియర్ రంజిత్, సహాయ కార్యదర్శిగా లకావత్ బాలకృష్ణ 20 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈసభలో సిపిఐ పార్టీ ములకలపల్లి మండల కార్యదర్శి ఎండి యూసుఫ్, ఎస్‌కే జబ్బర్, చావా అప్పారావు, బొడ్డు కృష్ణ, వాడే నగేశ్, సున్నం ప్రసాద్, కూరం రాములు, తదితరులు పాల్గొన్నారు.

# శాపంగా ఎస్‌బిఐ సిఎస్‌పి పాయింట్..!

-నిరక్ష్యారాశులు, పింఛన్ దారులే టార్గెట్
-బ్యాంకు ఖాతాలలో నగదు మాయం చేస్తున్న వైనం
-మొన్న కఘుత్రి, నిన్న లక్ష్మీ బాయి, భారతమ్మ, రేపు ఎవరు
-పెరుగుతున్న మినీ బ్యాంక్ బాధితులు



ప్రజాపక్షం/కారేపల్లి: మండల కేంద్రంలో ఉన్నటువంటి ఎస్‌బిఐ సిఎస్‌పి పాయింట్ మండల ప్రజలకు శాపంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్నటువంటి ఆసరా పింఛన్లు, స్వయంగా సంఘాల డిపాజిట్లు, ఎస్‌బిఐ సిఎస్‌ఐ పాయింట్ల నిర్వాహకులకు వరంలా మారుతున్నాయి. ఆసరా పింఛన్లు తీసుకుంటున్న ముసలి వాళ్ళని టార్గెట్ చేస్తూ వాళ్ల ఖాతాలు కొల్లగొడుతున్నారు. ఖాతాలో ఉన్నటువంటి డబ్బులను వారికి తెలియకుండానే డ్రా చేసి మీ ఖాతాలో డబ్బులు లేవని వెనక్కి పంపించిన కథనాలు ఎన్నో ఉన్నాయి. ఇది ఇలా ఉండగా ఈ మధ్యకాలంలో ఓ బాధితురాలు ఎస్‌బిఐ మినీ బ్యాంక్‌లో 3 వేల రూపాయలు ఖాతాలో ఉంటే తన అవసరం కోసం 2000 రూపాయలు డ్రా చేసుకోవటానికి వెళ్లగా మినీ బ్యాంక్ నిర్వాహకులు 3000 డ్రా చేసి 2000 చేతికిచ్చి పంపించారు. మిగిలిన పైకం డ్రా చేసుకోవడానికి కొన్ని రోజుల తర్వాత మినీ బ్యాంక్ రాగా ఎకౌంట్లో డబ్బులు లేవని చెప్పడంతో అనుమానం వచ్చి ఎస్‌బిఐ బ్యాంక్‌కు వెళ్లి అకౌంట్ స్టేట్మెంట్ చూసుకోగా మినీ బ్యాంక్‌లో 3000 డ్రా చేసినట్టు ఉందని బ్యాంక్ అధికారులు చెప్పగా ఆ అమాయకురాలు కంగు తిన్నది. వెంటనే బాధితురాలు ఎస్‌బిఐ సిఎస్‌పి నిర్వాహకులను నిలదీయగా 1000 రూపాయలు తిరిగి ఇచ్చారని బాధితురాలు వాపోయారు. ఇలాంటి సంఘటనలు మండలంలో పలు మార్లు జరుగుతున్న ఈ విషయం బ్యాంక్ అధికారులకు సిఎస్‌పి పాయింట్ నిర్వహణ అధికారి ఎఫ్ఐ శివకుమార్‌కు పలుమార్లు కంప్లైంట్ చేయగా వారు కూడా సిఎస్‌పి పాయింట్ల్ తనిఖీ చేశారు. కానీ తప్పు చేసిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోకపోవడంతో దొంగ చేతికి తాళబూలు అందించిన విధంగా మళ్లీ వారే యధావిధిగా సిఎస్‌పి పాయింట్లు నిర్వహిస్తూ అందిన కాడికి దండుకుంటూ సిఎస్‌పి పాయింట్లు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇకనైనా ఎస్‌బిఐ, ఆర్‌బిఐ అధికారులు ఈ సిఎప్‌పి ఆగడాలకు కళ్లెం వేసే విధంగా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

## ఉప మార్కెట్‌ను శాశ్వత మార్కెట్‌గా ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు ఉప మార్కెట్‌ను శాశ్వత మార్కెట్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో రౌండ్ టేండ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్ష వర్గంగా బానోత్ ధర్మ అధ్యక్షతన కామ్రేడ్ గుండెపినేని వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు, రోకటి బాబు, బొల్లం లక్ష్మయ్య, లకావత్ నాగేశ్వరరావు, మూడు చిట్టిబాబు, షేక్ నాగులు మీరా, బానోతు రాంబాబు, తోటకూరి నరేష్ పాల్గొని మాట్లాడుతూ జూలూరుపాడులో గత 20 సంవత్సరాల నుండి ఉప మార్కెట్‌గా అనేక పోరాటాల వల్ల ఏర్పడినందున ఈ మార్కెట్‌లో రైతాంగానికి అందుబాటులో వారి పంటను అమ్ముకోటానికి అనుకూలమైన సెంటర్ అని వారన్నారు. ఈ మార్కెట్‌లో అనేక మంది కార్మికులు గుమ్మస్తులు వ్యాపారవర్గాలు జీవిస్తున్నారని ఈ మార్కెట్ క్రయ విక్రయాల్లో ప్రభుత్వానికి చెస్ రూపంలో కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ ఉప మార్కెట్‌ను శాశ్వత మార్కెట్‌గా ఏర్పాటు చేయటానికి గత కొంత కాలంగా వివిధ రాజకీయ పక్షాల ఆధ్వర్యంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అనేక దఫాలుగా అనేక రూపాలలో అనేక పోరాటాలు నిర్వహించి, ప్రజాప్రతినిధులకు అధికారులకు ఈ మార్కెట్ సమస్య మీద వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మార్కెట్‌ను శాశ్వత మార్కెట్‌గా ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ అధికారులు పాలకులు విఫలం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మారెట్ సాధించేంత వరకు మార్కెట్ సాధన కమిటీ ఎన్నుకోవడం జరిగిందన్నారు. కమిటీ కన్వీనర్‌గా బానోత్ ధర్మాను ఏకగ్రీవంగా సమావేశంలో ఆమోదంతో ఎన్నుకున్నారు. 29 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు తాలూరి లక్ష్మయ్య, ఎల్లంకి మధు, లింగాల వీరభద్రం, తోటకూర నరేష్, ఎస్‌కె చాంద్ పాషా, చలమల నరసింహారావు, మేస్త్రులు గతం బాబురావు, పోతురాజుల బోడయ్య, పప్పుల జాను, పందు ఇల్లంగి, సురేందర్ బాబు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులతో అంతా మంచే జరగాలి

### జిఎం సివిల్ ధనసరి వెంకటేశ్వర్లు ఆకాంక్ష



ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి సివిల్ రైల్వే సైడింగ్ భవాని మాత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిఎం సివిల్ ధనసరి వెంకటేశ్వర్లు, కె సి హెచ్ పి, డి వై జి ఎం మదన్ నాయక్ అమ్మవారి ఆశీస్సులతో అంతా మంచే జరగాలని జిఎం సివిల్ ధనసరి వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు ఏరియా కొండాపురం సి ఎస్ పి రైల్వే ట్రాక్ సమీపంలో సింగరేణి సివిల్ రైల్వే కాంటాక్ట్ కార్మికుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన భవాని మాత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అతిథులను ఆహ్వానితులను కాంట్రాక్ట్ కార్మికులు వారి కుటుంబ సభ్యులతో లాంచనాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ పని అయినా ప్రమాద రహితంగా జరగాలి అంటే మానవ కృషితో పాటు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంట్రాక్ట్ కార్మికులు కుంట గురుమూర్తి, కురం నాగేశ్వరరావు దంపతులు పీటలపై కూర్చున్నారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి కొండాపురం సి ఎస్ పి.డి.జి.ఎం.వి మదన్ నాయక్, సివిల్ డి వై ఎస్ ఈ పాత్రుడు, సంక్షేమ అధికారి కిరణ్ అమ్మవారి విగ్రహ దాత కాంట్రాక్టర్ పి వెంకటేశ్వర్లు విశిష్ట అతిథులుగా పాల్గొనగా ఆలయ నిర్మాణ సహకారం ఎస్.ఆర్.సి ఇన్ ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆలయ నిర్మాణానికి విగ్రహ ప్రతిష్ఠకు అన్ని విధాలుగా సహకరించిన సివిల్ మరియు కె సి ఎస్ టి అధికారులకు, కాంట్రాక్టర్లకు, సివిల్ సూపర్వైజర్లకు సింగరేణి సివిల్ రైల్వే కాంటాక్ట్ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా అంగోత్ మంగీలాల్ వ్యవహరించగా కాంట్రాక్ట్ కార్మికులు వారి కుటుంబ సభ్యులు కార్మిక సంఘాల నాయకులు, సింగరేణి సివిల్ రైల్వే గ్యారేజ్ కార్మికులు కే రవి కుమార్, ఎస్కె రజబలి, ఎం సాంబశివరావు, యు శివరామకృష్ణ, టి రామకృష్ణ, ఎం వెంకటేశ్వర్లు, ఏ వినయ్ కుమార్, ఎం టైసన్, ఐ గోపి, ఎం రవికుమార్, కే నాగరాజు, సంపత్ కుమార్, ఎం గురు ప్రసాద్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలి



ప్రజాపక్షం/ఆళ్లపల్లి:ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన, నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని విత్తన డీలర్లకు ఏడిఏ తాతారావు తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం విత్తన డీలర్లతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన డీలర్లు తమ లైసెన్సులను సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని, బిల్ బుక్స్‌ను సమయానుసారంగా ధ్రువీకరించాలని తెలిపారు. నకిలీ విత్తనాలను రైతులకు అంటగడితే తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి కే అనిల్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి ఆర్ విజయ్ వంశీ, బి వినయ్, మండలంలోని విత్తన షాప్ యజమానులు పాల్గొన్నారు.

## విత్తనాలు ఎరువులు పురుగు మందులు సబ్సిడీలకే అందజేయాలి




ప్రజాపక్షం/ఆళ్లపల్లి: మండల రైతాంగానికి విత్తనాలు ఎరువులు పురుగు మందులు సబ్సిడీలకే అందజేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు మాచర్ల సత్యన్న, డివిజన్ నాయకులు గొగ్గేల వెంకటేశ్వర్లు, డివిజన్ కార్యదర్శి ఈసం శంకరన్నలు అన్నారు. అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆళ్లపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం మండల నాయకులు జోగ సారన్న, ఏదూర్ల రామనాథం, పాయం బాబురావు, పూసం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



ప్రజాపక్షం/చంద్రుగొండ: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చంద్రుగొండ అటవీ శాఖ రేంజర్ ఎల్లయ్య స్పష్టం చేశారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రేంజ్ కార్యాలయంలో మొక్కలు నాటి, ప్రధాన సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా రేంజర్ ఎల్లయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, కట్టెలతో వంటలు వండే విధానాన్ని పూర్తి బంద్ చేయాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మిద్దామని, కాలుష్యం వల్ల అన్ని రకాలుగా పర్యావరణం దెబ్బతింటొందన్నారు. అనంతరం వృత్తిలో మంచిగా పని చేసిన విఎస్‌ఎస్ బాధ్యులను ఘనంగా ఆయన సన్మానించారు. ఈకార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, విఎస్‌ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న తాటి



ప్రజాపక్షం/ములకలపల్లి: మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో సున్నం వెంకటేశ్వర్లు, మంగ దంపతుల కుమారుడు శ్రీనివాస్ వివాహ వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బూర్గంపాడు, అశ్వారావుపేట మాజీ ఎంఎల్ఏ, తెలంగాణ రాష్ట్ర మాజీ ట్రైకర్ ఛైర్మన్ తాటి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈసందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వస్త్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బైటి రాకేష్, వాడే నాగరాజు, కర్నాటి రమేష్, బొల్లిపల్లి రమేష్, కారం రాంబాబు, బైటి చిరుమప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/కరకగూడెం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రేంజర్ తేజస్వి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద పారిశుద్ధ్య పనులు నిర్వహించి ప్లాస్టిక్ కు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణం కాపాడటానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి మొక్కను పెంపొందించాలన్నారు. చెట్లను నరకడం వలన మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్వోలు గోవింద్, ఏడుకొండలు, వెంకటమ్మ, రామనాథం, సూరయ్య, బీట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

## -మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : మొక్కల పెంపకంతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని ఖమ్మం కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని దానవాయిగూడెం డంపింగ్ యార్డు వద్ద భారీగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్ యార్డు చాలా సంవత్సరాలుగా చెత్తతో నిండిపోయిందని ఈ ప్రదేశాన్ని బయో మైనింగ్ ద్వారా శుభ్రపరిచి పచ్చదనం ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. డంపింగ్ యార్డులోని ముందు భాగంలో పది ఎకరాల భూమిని పచ్చని ప్రదేశంగా అభివృద్ధి చేసినట్లు వారు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. భవిష్యత్తు తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి రాధిక, పర్యావరణ ఇంజనీర్ టిఎంసి సుజాత, డిఎంసి సుజాత, శానిటరి సూపర్‌వైజర్ సాంబయ్య, గార్డెన్ సిబ్బంది, మెప్మా సభ్యులు, శానిటేషన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మేడేపల్లి గ్రామపంచాయతీకి ఉత్తమ అవార్డు

## - తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఉత్తమ అవార్డు ఎంపిక
## - మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శి పగడాల రమ్యకు బహుమతి ప్రదానం



ప్రజాపక్షం/ ముదిగొండ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ పబ్లిక్ కమిషనర్ భవనంలో తెలంగాణ కాలుష్య నివారణ మండలి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనం, పరిశుభ్రత పాటించి తడి చెత్త పొడి చెత్త సేకరించి సేంద్రియ ఎరువులు తయారీపై గ్రామపంచాయతీలకు బహుమతులు అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు గ్రామ పంచాయతీలు ఎంపిక కాగా ఖమ్మం జిల్లాలోని ముదిగొండ మండలం మేడేపల్లి గ్రామ పంచాయతీ ఎంపికైంది. పచ్చదనం పరిశుభ్రతపై గ్రామపంచాయతీలో తడి చెత్త పొడి చెత్త సేకరించి వర్మీకంపోస్ట్ సేంద్రియ ఎరువుల తయారీపై గ్రామపంచాయతీలో ప్లాస్టిక్ నివారణ, మొక్కల పెంపకంపై మేడేపల్లి గ్రామపంచాయతీని జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఎంపిక చేయగా రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ చేతుల మీదుగా మేడేపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి పగడాల రమ్య ఉత్తమ అవార్డు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రమ్య మాట్లాడుతూ తెలంగాణ కాలుష్య నివారణ మండలి ఆధ్వర్యంలో మేడేపల్లి గ్రామపంచాయతీ ఉత్తమ అవార్డు అందుకోవటం ఎంతో సంతోషదాయకమని, మేడేపల్లి గ్రామపంచాయతీలో తడి చెత్త పొడి చెత్త సేకరణ, వర్మికంపోస్ట్ సింగిల్ యూస్ , ప్లాస్టిక్ నివారణ, మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించామని అన్నారు. పచ్చదనం పరిశుభ్రతపై ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు అందుకోవటంలో మేడేపల్లి గ్రామ ప్రజల సహకారం కూడా ఉందని ఆమె అన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ శ్రీజ, డిపిఓ ఆశాలత డిఆర్‌డిఏ పిడి సన్నసయ్య ఎంపిడిఓ, ఎంపిఓ వాల్మికి ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు అందుకునేందుకు వారు కృషి చేశారని ఆమె తెలిపారు. ఉత్తమ అవార్డు అందించిన మంత్రి కొండా సురేఖకు, తెలంగాణ కాలుష్య నివారణ మండలి వారికి, పంచాయతీ కార్యాదర్శి పగడాల రమ్యకు మేడేపల్లి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లాలో ముగ్గురు మంత్రులు అభివృద్ధిపై దృష్టి సారించారు..

## రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఖమ్మం ఉమ్మడి జిల్లా లో అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు ముగ్గురు మంత్రులు ప్రత్యేక దృష్టి సారించారని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని రాజేశ్వరపురంలో గురువారం రేషన్ దుకాణం ను తనీఖీ చేశారు. పేదలకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యం ను పరిశీలించారు. మూడు నెలల బియ్యం పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న లబ్ధిదారులతో మాట్లాడారు. రేషన్ సక్రమంగా అందుతుందా లేదా అని ప్రశ్నించారు. గతంలో దొడ్డ బియ్యం ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తుంది. ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు సంతోషం ను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ప్రభుత్వంఏర్పడిన తరువాత అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. పేదలకు కావాల్సిన ఇళ్లు, ఆహారం ప్రభుత్వం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పేద ప్రజలకు అన్నం పెట్టాలని ఆనాడు ఇందిరాగాంధీ చట్టం తీసుకొచ్చిందని అన్నారు. జిల్లా అభివృద్ధి కోసం మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు లు అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయం లో ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలుచేస్తుందని అన్నారు. ఇంకా మూడున్నర సంవత్సరాల కాలం లో మరిన్ని పథకాలు ప్రవేశపెడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, బొందయ్య, యడవల్లి నాగరాజు, కడియాల నరేష్, బచ్చలకూరి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# 18న నేలకొండపల్లిలో దివ్యాంగుల మహార్యాలీ

ప్రజాపక్షం/నేలకొండపల్లి : దేశ రక్షణ కోసం పాకిస్తాన్ ఉగ్రవాదులను తరిమికొట్టిన త్రివిధ దళాలకు దివ్యాంగులు సెల్యూట్ చేస్తున్నామని తెలంగాణ దివ్యాంగుల జేఏసీ చైర్మన్ పి.వీ. చలమయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం జేఏసీ సమావేశం ను నిర్వహించారు. తొలుత వీర జవాన్లకు సంతాపం ను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి పోరాడిన త్రివిధ దళాలకు దేశం అంతా రుణపడి ఉంటారని అన్నారు. వీర జవాన్ల సేవలు మరవలేనివి అన్నారు. దేశ ప్రజల కోసం అహర్నిశలు పాటుపడుతున్న భారత ప్రభుత్వం కు తమ మద్దతు ను ప్రకటించారు. అదే విధంగా జవాన్ల కు అండగా దివ్యాంగుల జేఏసీ ఆధ్వర్యం లోఈ నెల 18న నేలకొండపల్లి లో మహార్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాలేరు డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో దివ్యాంగులు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు రామకృష్ణ, వెంకటేశ్వర్లు, తిరపమ్మ, బిక్షం, శ్రీను, గోపి, రాజ్యామి, నాగరాజు, పుల్లయ్య, రాము, కె.వీరన్న, రఫీ, అనిత, రాధా, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



ప్రజాపక్షం/ బోనకల్ : పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారానే మానవ మనుగడ సాధ్యమవుతుందని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని రాపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటరమణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాపల్లి గ్రామంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ఖాళీ స్థలాలు, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, ఆలయాల వద్ద మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించాలని, అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో మురుగు నిల్వలేకుండా చూడాలని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలి



ప్రజాపక్షం/ మధిర : ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని మధిర సీనియర్ సివిల్ జడ్జి ఎన్.ప్రశాంతి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టు ఆవరణం నందు గురువారం మొక్కలను నాటారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి వాటిని పెంచడం ద్వారా వాతావరణ సమతుల్యత సాధ్యమై భవిష్యత్ తరాల మనుగడకు ఎంతగానో ఉపయోపడుతుందని అన్నారు. అదేవిధంగా మధిర మున్సిపాల్టీ పరిధిలోని అంబారుపేట చెరువ వద్ద మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అలాగే బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోడీ పిలుపులో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బిజెపి నాయకులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో ఎస్ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, డిఆర్‌ఓ వెంకటలక్ష్మీ, న్యాయ్యవాదులు, పోలీస్, కోర్టు సిబ్బంది, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా వాడకాన్ని తగ్గించాలి



ప్రజాపక్షం/ మధిర : రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయ పరిశోధన స్థానం సైంటిస్టు డాక్టర్ రుక్మిణీదేవి తెలిపారు. మధిర రైతు వేదికలో వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియాను దఫ దఫాలుగా పంటకు వేసుకోవాలని, ఒకేసారి యూరియా వేసుకోవడం వలన పంటలకు అధిక చీడపీడలు ఆశించే అవకాశం ఉందని తెలిపారు. అలాగే వరిలో ప్రతిమూడు సీజన్లకు ఒకసారి జింక్ అనేది దుక్కిలో వేసుకోవాలని, వరి కోయాలని, కాల్చకుండా భూమిలో కలియ దున్నుకోవాలని, అంతే కాకుండా నూనె గింజలు, అపరాలు పెంచడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలని రైతులకు సూచించారు. అదేవిధంగా నాణ్యమైన విత్తనాలు, సమగ్ర సస్యరక్షణ చర్యలు, డ్రిప్ ఇరిగేషన్ తదితర విషయాలపై రైతులకు వివరించి తగిన సలహాలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఆర్‌ఎస్ సైంటిస్టులు టి.భరత్, నాగస్వాతి, వ్యవసాయ సహాయ సంచాలకులు స్వర్ణ విజయచంద్ర, కనకం సాయిదీక్షిత్, ఉద్యానశాఖ అధికారి విష్ణు, మధిర ఎఈఓ టి.జిష్ణు, ఆత్మ కమిటీ సభ్యురాలు శ్రీలక్ష్మీ , ఆత్కూరు, దిదుగుపాడు, నక్కలగరుబు రైతులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వరుని సేవలో పాలకుర్తి ఎమ్మెల్యే



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన జమలాపురంర శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని గురువారం వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డితో పాటు ఆమె అత్తగారైన దేవాలయ తూర్పు ప్రకార మండపం నిర్మాణ దాత మామిడాల ఝాన్సీ రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. వారిని ఆలయ అధికారులు, అర్చకులు దేవాలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వారికి స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, స్వామి వారి జ్ఞాపిక అందచేసి వేద ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, పర్యవేక్షణాధికారి కె.విజయకుమారి, సోమయ్య, కృష్ణప్రసాద్, ఎర్రుపాలెం సొసైటీ అధ్యక్షులు ముల్పూరి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతిని రక్షిద్దాం.. భావితరాలను కాపాడుదాం

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ప్రకృతిని రక్షించి భావితరాలకు ఆదర్శంగా నిలుద్దామని జిల్లా ప్రధన న్యాయమూర్తి పాటిల్ సంపత్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించడమే నేటి తరానికి గొప్ప బాధ్యత అన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ ఆరోగ్య కరమైన వాతావరణాన్ని అందించిన వారమవుతామని చెప్పారు. మొక్కలు నాటే కార్యక్రమాన్నిప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి రాజేందర్ అన్నారు. అనంతరం కోర్టు ప్రాంగణం నుండి పోస్టాఫీస్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీని ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులతో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు కూడా పాల్గొన్నారు.

# 20 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించండి



-ఉచిత వాహనం ఏర్పాటు చేస్తాం
-ఆరు నెలల్లో మార్పు చూపిస్తాం
-బడిబాట కార్యక్రమంలో కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం నారపునేనిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అడిషనల్ కలెక్టర్ శ్రీజ, డిఈవో సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో గ్రామంలో ఉన్న నిరుపేద విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. గత సంవత్సరం ఇదే పాఠశాలలో ఒకే ఒక విద్యార్థిని చదువుతుండగా ఆ పాఠశాలను నిలుపుదల చేయకుండా విద్యను కొనసాగించడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం పాఠశాలల ప్రారంభ సమయానికి బడిబాట కార్యక్రమంలో 20 మంది విద్యార్థుల వరకు పాఠశాలలో చేర్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను మౌళిక వసతులు కల్పించి కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తామని తెలిపారు. గ్రామంలో విద్యార్థుల కోసం వాహనాన్ని సైతం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్పొరేట్ స్థాయి పాఠశాలలో రిజల్ట్ కంటే ప్రభుత్వపాఠశాలల్లో రిజల్ట్ అధికంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1500 ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయని, వాటిలో 60 పాఠశాలలు జీరో స్థాయికి పడిపోయాయని తెలిపారు. జీరో స్థాయి ఉన్న పాఠశాలలను సైతం మౌళిక వసతులు కల్పించి పాఠశాలలు కొనసాగించేందుకు కృషి చేస్తామని తెలిపారు. నారపనేనిపల్లి పాఠశాలలో చదువుతున్న ఒకే ఒక విద్యార్థిని కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకొని ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఈవో సత్యనారాయణ, ఎంఈవో వెంకటేశ్వర్లు, ఎంపిడివో, పంచాయతీరాజ్ డిఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భారత జాతీయ మహిళా సమాఖ్య ఆవిర్భావ దినోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య ఖమ్మంజిల్లా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ 71వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా గురువారం ఖమ్మం వన్‌టౌన్ ప్రాంతం ముస్తఫానగర్‌లో నిర్వహించిన వేడుకల్లో మహిళా సమాఖ్య ఖమ్మంజిల్లా సమితి అధ్యక్ష, కార్యదర్శులు పోటు కళావతి, ఏపూరి లతాదేవి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఏపూరి లతాదేవి పతాకావిష్కరణ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ చట్టసభల్లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని పోరాడి సాధించినప్పటికీ బిజెపి ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయడం లేదని వారు ఆరోపించారు. మహిళల సంక్షేమం పట్ల బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని చట్టాన్ని అమలు పర్చడంలో విఫలమైందన్నారు. స్థానిక సంస్థలు మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కావాలని పోరాడిన ఘనత భారత జాతీయ మహిళా సమాఖ్యకే దక్కిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలన్నారు. మహిళలకు రూ. 2,500 నేటికి ఇవ్వడం లేదన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలను ప్రభుత్వం వెంటనే ఆపాలని వారు డిమాండ్ చేశారు. షీ టీమ్‌లను పెంచాలని, మహిళా పోలీస్ స్టేషన్లను కూడా ప్రతి మండలంలో ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళల హక్కుల సాధన కోసం ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ నిరంతరం పోరాటం సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, నాగమణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** రానున్న రోజులు వర్షాలు తీవ్రంగా ఉంటాయన్న అంచనాతో ప్రకృతి విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని తహశీల్దార్ జి.లూథర్‌విల్సన్, ఎంపిడిఓ ఎస్కే సిలార్‌సాహెబ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాలతో తిరుమలాయపాలెం రైతు వేదిక నందు ప్రకృతి విపత్తును ఎదుర్కొనేందుకు మండల, గ్రామస్థాయి అధికారులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండల, గ్రామస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి వర్షాలకు ప్రభావితమయ్యే గ్రామాలను ముందుగానే పసిగట్టాలని ఆయన అన్నారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు ఖమ్మం జిల్లాతో పాటు తిరుమలాయపాలెం మండలం రాకాసి తండా పలు గ్రామాల్లో తీవ్ర నష్టాన్ని కలిగించిందని, అలాంటి పరిస్థితి ఎదురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఎప్పటికప్పుడు సైడ్ కాల్వలను శుభ్రం చేయాలని, బ్లీచింగ్ చల్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, పశువులకు గాలికుంటు వ్యాధులు రాకుండా ముందుగానే పశువైద్యాధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పుల్లయ్య, ఎంపిఓ పి.సూర్యనారాయణ, మండల వ్యవసాయాధికారి సీతారామరెడ్డి, వైద్యాధికారులు వసుంధర, హారిక, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ ఖలీల్, ఇరిగేషన్‌శాఖ ఇంజనీర్ రామకృష్ణ, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సివిల్ హెచ్‌ఓడికి ఎఐటియుసి ఆధ్వర్యంలో సన్మానం



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణి సివిల్ డిపార్ట్మెంట్ హెచ్వోడీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు కు సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్‌ఏఐటియుసి ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం కొత్తగూడెం హెడ్ ఆఫీస్ లో సివిల్ హెచ్‌ఓడి వెంకటేశ్వరులు కు తన ఛాంబర్ లో శాలువాక, ఫ్లవర్ బొకే ను ఇచ్చినారు. సింగరేణిలో అత్యంత ముఖ్యమైన సివిల్ విభాగానికి ప్రధాన అధికారిగా బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కే డబ్ల్యూ కిష్టాఫర్ లు మాట్లాడుతూ, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు తమ వంతుగా కృషి చేయాలని కోరారు. వేతనాలు ఇతర సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.చంద్రశేఖర్, సిహెచ్ శ్రీను, కే.నరసింహ, లక్ష్మి, జ్యోతి, వినోద, కిరణ్, కళావతి, శేఖర్, నిర్మల, విజయశ్రీ, విజయలక్ష్మి,బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలపై దరఖాస్తులు వెల్లువ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలపై దరఖాస్తులు వెల్లువాలా వస్తున్నాయి. అధికంగా లోకారం, తూర్పు, పడమర లోకారం, హనుమతండల తండా, కల్లూరు, గోకారం తది తర గ్రామాలలో ఇప్పటివరకు జరిగిన గ్రామసభలలో అధికంగా వచ్చినట్లు తహశీ ల్దార్ పులి సాంబశివుడు తెలిపారు. 2018 తర్వాత రెవెన్యూ సదస్సులు అన్ని గ్రామాలలో గ్రామసభలు జరుగుతుండటంతో పాత సమస్యలు, అన్నదమ్ముల మధ్య ఉన్న మిస్సింగ్ భూ సర్వే నెంబర్లు, వారసత్వం, సీలింగ్, సాదా బైనామా, పలు రకాలుగా పలు విధాలుగా ఉన్న భూ సమస్యలను పరిష్కారం కోసం రైతులు గత ఏడు సంవత్సరాలుగా ఎదురు చూపులతో ఉన్న భూ సమస్యలు పై అధిక సంఖ్యలో రైతుల వద్ద నుంచి దరఖాస్తులు వస్తున్నట్లు తహశీల్దార్ పులి సాంబశివుడు, డిప్యూటీ తహశీల్దార్, బాబ్జి ప్రసాద్ లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులపై త్వరలో పరిష్కార మార్గాలు చూపుతామని పేర్కొన్నారు.

# పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** ఆర్థిక ఇబ్బందులతో పురుగుమందు తాగి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆసుపాక గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేట మండలం ఆసుపాకకు చెందిన వీర్నాల సత్యనారాయణ(27) మూడు నెలల క్రితం గ్రామంలో నూతనంగా ఇళ్లు నిర్మించాడు. అప్పటి నుండి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. గురువారం గుమ్మడవల్లి సమీపంలో ఉన్న పెద్దవాగు ప్రాజెక్టు ఆనకట్ట వద్ద విగతజీవిగా పడి ఉన్న అతన్ని చూసిన కొందరూ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసలు సత్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి మృతదేహం పక్కన ఉన్న పురుగుమందు డబ్బాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య సత్యవతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్టా మహోత్సవం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని బనిగండ్లపాడు, బుచ్చిరెడ్డిపాలెం, చొప్పకట్లపాలెం గోపవరం గ్రామాల సరిహద్దులో ఉన్న అంజనాద్రి గుట్టపై అభయ ఆంజనేయస్వామి ఆల పున నిర్మాణ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ వేదాంతం రాధాకృష్ణమాచార్యులు, వేద పండితుల నడుమ అంగరంగ వైభవంగా ప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, అమ్మఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క, ఎన్నారై హనుమండ్ల ఝాన్సీరాణి, మాజీ జెడ్పిచైర్మన్ లింగాల కమల్‌రాజు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆలయ ప్రతిష్ట మహోత్సవానికి సహకరించిన దాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఆలయ ప్రతిష్టా మహోత్సవానికి వచ్చిన భక్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాటు చేసి సుమారు 7వేలమంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ క్యాక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మండల నాయకులు, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటడం మనందరి బాధ్యత



**ప్రజాపక్షం/వైరా:** మొక్కలు నాటడం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని వైరా మున్సిపాల్ కమీషనర్ చింతా వేణు అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం నల్ల చెరువు కట్ట మీద వన మహోత్సవం కార్యక్రమం చేపట్టారు. చెరువు కట్టకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని కమీషనర్ చింతా వేణు ప్రారంభించారు. ఈ సందర్భంగా కమీషనర్ చింతా వేణు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి, పచ్చదనాన్ని పెంపొందించడానికి వన మహోత్సవం కార్యక్రమం చేపట్టిందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ వారి బాధ్యతగా మొక్కలను పెంచి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ ఏఈ శ్రీమాన్య, మెప్మా టిఎంసి బండారుపల్లి వెంకటేశ్వర్లు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ బి.వెంకటరావు, నంద్రు నాగరాజు, మెప్మా ఆర్‌పిలు, అమృత మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తోగుగూడెం గ్రామంలోని అమృత సరోవర్ ట్యాంక్ వద్ద మొక్కల నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మణుగూరు మండలంలోని తోగ్గూడెం గ్రామం లో అమృత సరోవర్ ట్యాంక్ వద్ద ప్రత్యేక మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎన్‌ఆర్ ఇజిఎస్ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ట్యాంక్ చుట్టూ హరిత వాతావరణాన్ని పెంపొందించడం, భూగర్భజలాల సంరక్షణకు దోహదపడేలా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ట్యాంక్ బండ్ల వెంబడి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ పట్ల గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు, పాల్గొన్నవారు ముఖ్యంగా ఈ విషయాలపై దృష్టి పెట్టారు

